ప్రభాతవార్త
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
శనివారం 04 అక్టోబర్ 2025


## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా ఆయుధపూజ



**కడప క్రైం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

విజయదశమి (దసరా) పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని ఆయుధాగారంలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయుధాలు, మోటారు ట్రాన్స్ పోర్టు విభాగంలో పలు వాహనాలకు జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ పూజలు చేశారు. జిల్లా పోలీసు ఆయుధాగారం ఆవరణలో దుర్గామాత చిత్రపటాన్ని మరియు అన్ని రకాల తుపాకులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కర్పూర హారతి ఇచ్చి ప్రజలు సుఖ శాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని ప్రార్థించారు. అనంతరం మోటారు ట్రాన్స్ పోర్టు విభాగానికి వెళ్లి పోలీసులు నిత్యం వినియోగించే ద్విచక్ర వాహనాలు, కార్లకు ఎస్పీ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, టైటస్, ఏవో వెంకటరమణ, టుటౌన్ సీఐ జి.సుబ్బారావు, రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి, చిన్నచౌకు సీఐ ఓబులేసు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉప్పు శంకర్, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌తో జగన్మోహన్ రాజు భేటీ

**రాజంపేట,అక్టోబర్3 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో భేటీ అయ్యారు. కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి జగన్మోహన్ రాజు కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలపై కలెక్టర్ తో చర్చించారు. పలు మండలాలు అభివృద్ధి పనులకు సంబంధించి కలెక్టర్ తో ప్రస్తావించారు. ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టర్ పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు.



కలెక్టర్ నిశాంత్ కుమార్ తో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

# ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి : కలెక్టర్



ఖైదీతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, తదితర అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

**కడప కలెక్టరేట్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**

శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకుని మంచి పౌరులుగా మారాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం స్థానిక కేంద్ర కారాగారంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో బోర్డ్ ఆఫ్ విజిటర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్,ప్రిన్సిపల్ డిస్టిక్ సెషన్ జడ్జ్ యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రభుత్వం ఖైదీల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నో వసతులను కల్పించిందన్నారు. క్షణికావేశంలో నేరం చేసి ఇక్కడకు ఖైదీలుగా వచ్చిన మీరు ప్రాయశ్చిత్తంతో పరివర్తన చెందాలన్నారు. గతమంతా మర్చిపోయి ఇక్కడ నుండి విడుదలయ్యాక ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిని అందుకుని హుందాగా జీవిస్తూ సమాజంలో గౌరవ ప్రతిష్టలను పొందాలన్నారు. విద్య ఇతరులతో, ఎలా మాట్లాడాలి..ఎలా నడుచుకోవాలి, కోపం వచ్చినప్పుడు ఆ కోపాన్ని మనలోనే ఎలా అణుచుకోవాలో ఉన్న సంస్కారం నేర్పిస్తుందన్నారు. కారాగారంలో ఉన్నప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించాలని ఖైదీలను ఉద్దేశించి అన్నారు. ఎం ఎ సోషియాలజీలో గోల్డ్ మెడల్ సాధించిన ఖైదీని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.ఈ కారాగారాలలో ఖైదీలకు వివిధ రకాల వృత్తుల్లో శిక్షణ ఇప్పించి వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి సహాయాన్ని అందిస్తామని కలెక్టర్ ఖైదీలకు భరోసా ఇచ్చారు. ప్రిన్సిపల్ డిస్టిక్ సెషన్ జడ్జ్, యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ నేర ప్రవృతిని విడనాడి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారవ్వాలన్నారు. కారాగారాలలో చదువుకోవడానికి ఆసక్తి ఉన్న ఖైదీలు..తాము చదువుకోవాలని ఇక్కడ అధికారుల ద్వారా మాకు దరఖాస్తు చేసుకుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా విద్యను అభ్యసించుకోవడానికి సహాయం అందిస్తామన్నారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలు ఇచ్చారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, మానసిక వ్యాధులతో బాధపడే ఖైదీల ఆరోగ్య విషయాలను మరియు వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు సకాలంలో మందులను వాడాలని తెలియజేశారు, జైలు పరిసరాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. జరిగినది, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగింది. ముందుగా జిల్లా కలెక్టర్,జిల్లా జడ్జి జిల్లా ఎస్పీ లతో కలిసి ఖైదీల వీడియో కాన్ఫరెన్స్ ఈ ములకత్ హాలును పరిశీలించారు అనంతరం. ఖైదీలకు అందుతున్న వైద్య సేవలు తదితర అంశాల పై డాక్టర్లతో మాట్లాడారు. వంటశాలను పరిశీలించి ఖైదీల డైట్ ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీల తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఖైదీలు తయారు చేసిన వస్తువులను, వర్కుషాప్ లను జిల్లా కలెక్టర్, జడ్జి, ఎస్పీ ఆశక్తిగా తిలకించారు. బోర్డ్ ఆఫ్ విజిటర్స్ సభ్యులుగా ఉన్న జిల్లా అధికారులతో కేంద్ర కారాగారంలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారం, పర్యవేక్షణ అధికారి కె.రాజేశ్వరరావు,మహిళా కారాగారం పర్యవేక్షణ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ సూపరింటెంట్ వెంకటేశ్వరరావు, కృష్ణవేణి, సివిల్ సర్జన్ నవీన్, బోర్డ్ ఆఫ్ విజిటర్స్ మీటింగ్ సభ్యులు,ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇక ఇంటర్ పరీక్షల సమరం

**ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల**

**అనుకున్నట్లుగానే 15 రోజులు ముందుగా పరీక్షలు**

**ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రాక్టికల్స్**

**23 నుంచి పరీక్షలు ప్రారంభం**



**రాజంపేట,అక్టోబర్3 ప్రభాతవార్త**

జాతీయస్థాయిలో జరిగే వివిధ ఎంట్రన్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఇంటర్ విద్యార్థులకు మరింత సమయం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. 10 సంవత్సరం మార్చి మొదటి వారం తర్వాత ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యేవి. ప్రభుత్వం అనుకున్నట్టుగానే గతంలో కంటే 15 రోజులు ముందుగా ఇంటర్ పరీక్షల ప్రారంభానికి షెడ్యూల్ ప్రకటించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమై 10తో ముగుస్తాయి. ఉదయం 9 గంటల నుంచి 12:00 వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:00 వరకు రెండో సేషన్ ఉంటుంది. అలాగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమవుతాయి. పరీక్షలు నెలరోజులపాటు నిర్వహిస్తారు.

# కుంగిపోయిన లోలెవల్ కాజ్వే వంతెన

**నీటి ప్రవాహంలో కొట్టుకపోనున్న పైప్‌లైన్... పట్టించుకోని అధికారులు**



**సిద్దవటం అక్టోబర్ 3 ప్రభాతవార్త**

మండలకేంద్రమైన సిద్దవటం పెన్నానదిపై నిర్మించిన లోలెవల్ వంతెన గత కొంత కాలంగా ప్రవహిస్తున్న వరద నీటి కారణంగా దెబ్బతింది. ఆగష్టు నెల నుంచి కుందూనది మరియు మైలవరం నుండి వస్తున్న వరద వర్షాల కారణంగా వచ్చిన వరద నీటి కారణంగా దాదాపు రెండు నెలల నుంచి పెన్నానది లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సిద్దవటం గ్రామానికి మంచినీటి అవసరాల కోసం రూ. 4 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో ఏర్పాటు చేసిన స్కీం వాటర్ పైప్ లైన్ లో లెవెల్ కాజ్వే పై ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహానికి గురువారం ఒక్కసారిగా పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్వే కుంగిపోయింది. వంతెనపై ఏర్పాటు చేసిన వాటర్ పైప్ లైన్ కూడా నీటి ప్రవాహంలో కొట్టుకుని పోయే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెన్నానది లోలెవల్ వంతెనపై ఉన్న పైపులైను హై లెవెల్ వంతెనపై ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు గతంలో వరదల కారణంగా చాలాసార్లు పైపులైను కొట్టుకొని పోవడంతో చాలా ఇబ్బందులు పడ్డామని ఆ పరిస్థితి రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్ వివరణ కోరగా లో లెవెల్ వంతెన దెబ్బతినిందని త్రాగునీటి పైపులు వరద బీభత్సం పెరిగితే నదిలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తాత్కాలికంగా ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం దగ్గర నూతనంగా బోరు ఏర్పాటు చేస్తామని పెన్నాలో నీటి వరద తగ్గుముఖం పట్టాక శాశ్వతంగా మరమ్మతులు చేయించేందుకు ఉన్నతాధికారులతో సంప్రదించి ఏర్పాట్లు చేస్తా మన్నారు.

## రూ.35 కోట్ల వ్యయంతో తారురోడ్డు పనుల ప్రారంభం



పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, కూడా చైర్మన్

**రాజంపేట,అక్టోబర్ 3 ప్రభాతవార్త**

రైల్వే కోడూరు చిట్వేలు డబుల్ రోడ్ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. స్టేట్ హైవే ప్లాన్ కింద 35 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 15 కిలోమీటర్ల దూరం రహదారి పనులు మంజూరు చేశారు. అయితే నిధులు మంజూరు కాలేదు. దీంతో కొన్ని పనులు చేసి నిలిపివేశారు. అయితే కూడా చైర్మన్ రూపానంద రెడ్డి చొరవ తీసుకొని ఆర్ అండ్ బి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో లాంఛనంగా రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్ నిర్మాణం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ పనులు పూర్తి అయినట్లయితే చిట్వేల్ వరకు ఉన్న 30 కిలోమీటర్ల దూరం డబల్ రోడ్డు నిర్మాణం పూర్తయినట్లు. ఇప్పటికే 15 కిలోమీటర్ల దూరం డబల్ రోడ్డు నిర్మాణం పూర్తయి ఉంది.నిర్దిష్ట సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బి ఈఈ సహదేవరెడ్డి, కూటమినేతలు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బొగ్గు లారీ దగ్ధమై డ్రైవర్ మృతి



**ముద్దనూరు. అక్టోబర్ 03 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిలో బుధవారం రాత్రి కృష్ణపట్నం నుంచి బొగ్గులోడుతో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు రహదారిలోని డివైడర్ను ఢీకొట్టడంతో రహదారి పక్కనే ఉన్న మోరి సమీపంలో పడి మంటలు చెలరేగి డ్రైవర్ సంజీవ్ 32 సంవత్సరాలు మంటలలో చిక్కుకుని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కృష్ణపట్నం నుంచి కర్ణాటక రాష్ట్రం హోస్పేటకు బొగ్గులోడుతో వెళుతున్న లారీ డివైడర్ను ఢీకొని మోరి సమీపంలో పడడంతో మంటలు చెలరేగమడంతో జమ్మలమడుగు, మరియు తాడిపత్రి ఫైర్ సిబ్బందికి స్థానికులు సమాచారం అందించగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని సిఐ దస్తగిరి పరిశీలించారు. ఈ ఘటనపై ఏఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎంజీపురం క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ చింతరాజుపల్లి జట్టు

**రాజంపేట,అక్టోబర్3 ప్రభాతవార్త**



రాజంపేట మండల పరిధిలోని మదన గోపాలపురం క్రీడమైదానంలో వారం రోజులపాటు నిర్వహించిన ఎంజీపురం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ,మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ కుమార్ రాజు శుక్రవారం అందజేశారు.ఫైనల్ మ్యాచ్ లో చింతకాయలపల్లి జట్టు, ఎంజీ పురం జట్టులు పోటా పోటీగా ఆడిన ఈ మ్యాచ్‌లో విన్నర్స్ గా చింతకాయల పల్లి జట్టు విన్నర్స్ నిలిచింది. ఎంజి పురం జట్టు రన్నర్సా నిలిచింది. ఈ టోర్నమెంట్ విన్నర్స్ కు 30,000 ,రన్నర్స్ కు 15,000 తెలుగుదేశం సీనియర్ నాయకులు,శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్,వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఉపాధ్యక్షులు, న్యాయ వాదుల సంఘ మాజీ అధ్యక్షులు కొండూరు శరత్ కుమార్ రాజు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ సంక్రాంతికి ఈ క్రీడ మైదానంలోనే ఎంజీపురం క్రికెట్ నిర్వాహకులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాలని విన్నర్ బహుమతి స్పాన్సర్ చేస్తానన్నారు.ఆ టోర్నమెంట్ లో ఎంజీ పురం జట్టు విన్నర్ గా నిలిచేందుకు ఇప్పటి నుంచి ప్రాక్టీస్ చేయాలన్నారు. ఎంజీ పురం టోర్నమెంట్ నిర్వాహుకులు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ నిర్వహించేందుకు సహకరించిన కొండూరు శరత్ కుమార్ రాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కోటి విలువైన కల్తీ మద్యం డంప్ సీజ్

**సౌత్ ఆఫ్రికా తరహా మద్యం తయారీ**

**మదనపల్లె క్రైమ్ అక్టోబర్ 3 ప్రభాతవార్త.**



జిల్లాలోని ములకలచెరువులో భారీ కల్తీ మద్యం తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా గుర్తించి సీజ్ చేశారు. ఈ డంప్‌లో సౌత్ ఆఫ్రికా తరహాలో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన కల్తీ మద్యం తయారీ డంప్ విలువ సుమారు కోటి రూపాయలకు పైనే ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధిలోని ములకలచెరువులో ఈ అక్రమ కేంద్రాన్ని కనుగొన్నారు. కల్తీ మద్యం తయారీకి వినియోగిస్తున్న యంత్రాలు, ముడిసరుకు, తయారైన బాటిళ్లను గుట్టలు గుట్టలుగా చూసి అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. కోటికి పైగా విలువ చేసే తయారీ యంత్రాలు, కల్తీ మద్యానికి ఉపయోగించే రెక్టిఫైడ్ స్పిరిట్ డ్రమ్ములు, కార్క్ లు, ఖాళీ సీసాలు, మ్యానుఫ్యాక్చరింగ్ యంత్రాలు, పెద్ద సంఖ్యలో బాక్సుల్లో నింపిన తయారైన కల్తీ మద్యం బాటిళ్లు, మద్యం బాటిళ్లపై అతికించేందుకు సిద్ధంగా ఉన్న నకిలీ స్టిక్కర్లును సీజ్ చేశారు. స్థానికంగా పెద్ద ఎత్తున ఈ నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న 9 మందిని ఎక్సైజ్, స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన అక్రమ మద్యం, తయారీకి వినియోగించే యంత్రాలు, ముడిసరుకు మొత్తాన్ని సీజ్ చేశారు. కల్తీ మద్యం తయారీ ముఠాపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఎస్ మధుసూదన్ రావు లు వెల్లడించారు. ఈ అక్రమ మద్యం తయారీకి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. అయితే ఈ కల్తీ మద్య వెనుక రాజకీయ పార్టీ నాయకులు ఉన్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## మహాత్మ గాంధీ ఆశయాలు స్ఫూర్తిగా చేసుకుందాం..

**- 156వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన ఎస్పీ**

**కడప క్రైం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

జాతిపిత మహాత్మ గాంధీ 156వ జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకొని బ్రిటీష్ వారిని ఎదిరించి శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించి చరిత్రలోనే మహోన్నత వ్యక్తిగా, జాతిపితగా నిలిచారని కొనియాడారు. 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో బ్రిటీషర్లు దిగి వచ్చి స్వాతంత్ర్యాన్ని ఇచ్చారన్నారు.

### దేశ 2వ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రిసి సేవలు స్ఫూర్తిదాయకం

జై జవాన్ జై కిసాన్ నినాదంతో జవాన్లు, రైతుల గుండెల్లో ధైర్యం నింపి దేశ భవిష్యత్తును నిర్మించిన ఆదర్శమూర్తి భారతరత్న, దేశ 2వ ప్రధాని లాల్ బహుదూర్‌శాస్త్రి అని జిల్లా ఎస్పీ కొనియాడారు. మహనీయుని 121వ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దేశ సేవే లక్ష్యంగా ఆయన నడిచిన బాట సదా అనుసరణీయమని ఎస్పీ పేర్కొన్నారు. దేశానికి నిస్వార్థంగా అంకిత భావంతో చేసిన సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, డీసీఆర్‌బీసీఐ ఈశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, టైటస్, ఏవో వెంకటరమణ, టుటౌన్ సీఐ జి.సుబ్బారావు, రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి, చిన్నచౌకు సీఐ ఓబులేసు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉప్పు శంకర్, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా విజయదశమి వేడుకలు

**స్వామివారి మెరమణి వెంబడి అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

**పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి మాత అమ్మవారు**





**బద్వేల్ అర్బన్ అక్టోబర్ 03 ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో దసరా ఉత్సవాలు 11 రోజులు పాటు అంగరంగ వైభవంగా వివిధ రకాల ప్రత్యేక పూజలు ప్రత్యేక అలంకారాలతో పలువురు భక్తులను ఆకట్టుకునే విధంగా దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు కనుమర్లపూటి ప్రసాద్, ట్రెజరర్ భూపాలం నాగరాజారావు, ఉపాధ్యక్షులు చాటక్నొడు సత్యనారాయణ ప్రసాద్, యాదాళ్ల కృష్ణమూర్తి, దర్శి సుబ్బరాజా, జూటూరు నాగరాజా, చలపాటి రవికుమార్, చిన్ని నరసింహ ప్రసాద్, దిండుకుర్తి సుబ్బరాయుడు, బెస్త మల్ల సునీల్ కుమార్,సగల రాధాకృష్ణమూర్తి, జాయింట్ ట్రెజరీలు తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య కొప్పరపు శ్రీనివాసులు కొలపర్తి వెంకట సుబ్బారావు, గుబ్బ వెంకటేశ్వర్లు, యువజన సంఘం అధ్యక్షులు భూపాలం రాఘవేంద్రరావు,సెక్రటరీ పైడిమర్రి సురేష్ బాబు,ట్రెజరర్ హరీష్ కుమార్, తోపాటు పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో దసరా వుస్తవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు, విజయదశమి పురస్కరించుకొని రాత్రి శ్రీ విజయలక్ష్మి దేవి అలంకారంలో పురవీధులలో గ్రామోత్సవంలో పలువురు భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు, అమ్మవారికి అడుగడుగునా పలువురు భక్తులు మంచినీరు వారు పోసి కాయ కర్పూరం సమర్పించుకొని జై వాసవి జై వాసవి అంటూ నినాదాలతో వాసవి మాత అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు, వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అమ్మవారి గాజులు, పసుపు, కుంకుమ మరియు అమ్మవారి ప్రసాదాలను భక్తులందరికీ అందజేశారు, అమ్మవారి గ్రామోత్సవం వెంబడి పలువురు భక్తులను ఆకట్టుకునే విధంగా అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు, అలాగే హైస్కూల్ వద్ద వివిధ రకాల కలర్స్ కొత్త రకాలతో కాల్చిన బాణాసంచా పలువురిని ఆకట్టుకునే విధంగా నిలిచింది, శుక్రవారం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి నిజ స్వరూప అలంకారంలో వసంతోత్సవంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు, పగలు ఉభయ దాతలుగా జూటూరు నాగరాజ పొట్టి శ్రీరాములు సర్కిల్ ప్రెసిడెంట్ ఆర్యవైశ్య వర్తక సంఘం వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం డోలారోహణం కార్యక్రమాన్ని నిర్వహించి పట్టణంలోని పలువురికి ప్రత్యేక అన్న ప్రస్నాద కార్యక్రమంతో దసరా ఉత్సవాలను ముగింపు చేశారు, ఈ కార్యక్రమంలో పట్టణములోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారస్తులు, వాసవి, వనిత క్లబ్, అవోప, అవప మహిళా విభాగ తోపాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపును రైతులందరూ వినియోగించుకోవాలి..

**సుండుపల్లి, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



మండలంలో పరిధిలోని జీఎస్టీ తగ్గింపుపై ట్రాక్టర్లతో ర్యాలీ కార్యక్రమము నిర్వహించడం జరిగినదని తాసిల్దార్ మహబూబ్ చాంద్ తెలియజేశారు. రైతులకు జీఎస్టీ 2.0 తగ్గింపుపై అవగాహన కల్పించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాష మాట్లాడుతూ రైతులకు ట్రాక్టర్లు, టైర్లు వాటి విడిభాగాలపై జిఎస్టి తగ్గించడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలు ఖర్చు గనియంగా తగ్గుతుందని తెలియపరచడం జరిగింది. అదేవిధంగా డ్రిప్పు పై 5 శాతం జీఎస్టీనీ సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. అలాగే ఆరు లక్షల విలువ చేసే ట్రాక్టర్ మీద ఇప్పుడు 42 వేల రూపాయలు ఆదా అవుతుందని తెలియ పరిచారు. అలాగే ట్రాక్టర్ల పై గతంలో12 జీఎస్టీ ని , ఇప్పుడు5 వరకు జీఎస్టీ అంటే7 వరకు పొదుపు అదేవిధంగా ట్రాక్టర్ల విడిభాగా లైన టైర్లు, హైడ్రాలిక్ పంపులు మీద 13 వరకు పొదుపు ఉందని చెప్పడం జరిగింది. డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింకర్లు, వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ఆక్వా కల్చర్ పరికరాలు, 12 రకాల బయోపిస్టిసైడ్స్, పాల క్యాన్లు మొదలగు వాటి మీద జిఎస్టి తగ్గడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ప్రసాద్ రాజు, మాలేపాటే శివరాం నాయుడు, జనసేన రామ శ్రీనివాస్, దామోదర్ నాయుడు, రైతులు, ఆర్ఎస్కే సిబ్బంది వారు, ఏ.పీ.సి.ఎన్.ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ప్రారంభం

పీలేరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

పీలేరులో వైయస్ఆర్ సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆ పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు. శుక్రవారం పీలేరులో వైసీపీ మండల పార్టీ కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు సుంకర చక్రధర్, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు షేక్ షాకీర్ బాష, మహిళా నాయకురాలు మహితాఆనంద్ తదితరులు వైయస్ఆర్ సీపీ డిజిటల్ బుక్ యాప్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న వేధింపులు, కక్షలు, తప్పుడు కేసులకు సమాధానంగా మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి వైయస్ఆర్ సీపీ డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని చెప్పారు. ఈ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలను రికార్డ్ చేసి, సాక్ష్యంగా నిలుపవచ్చని తెలియజేశారు. మన వెనుక మన నాయకుడు జగనన్న ఉన్నాడని, ప్రతి అన్యాయం ఇకపై డిజిటల్ రికార్డు అవుతుందని, ప్రజల హక్కుల కోసం, కార్యకర్తల రక్షణ కోసం వైయస్ఆర్ సీపీ ఎప్పటికీ పోరాటం చేస్తూనే ఉంటుందని తెలియజేశారు.

## రిటైర్డ్ హెడ్ మాస్టర్ సురేంద్ర రెడ్డి మృతి

పీలేరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:



శుక్రవారం సదుం మండలం, ఊటుపల్లి గ్రామానికి చెందిన తాతగారి సురేంద్రరెడ్డి (రిటైర్డ్ హెడ్ మాస్టర్) మరణించారు. ఈ వార్త తెలుసుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి ఊటుపల్లి గ్రామానికి చేరుకుని, వారి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సురేంద్ర రెడ్డి గ్రామంలో ఎంతో గౌరవనీయులు. ఉపాధ్యాయునిగా పనిచేసిన సమయంలో అనేక మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. మాజీ ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి మాట్లాడుతూ "సురేంద్ర రెడ్డి మా కుటుంబ పెద్దలతో చాలా సన్నిహిత సంబంధాలు కలిగిన వారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, రాజన్న, కృష్ణాంజనేయులు, గండబోయినపల్లి శీన , ప్రసాద్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, బంధువులు, అనేకమంది గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

## జీఎస్టీ తగ్గింపుపై రైతులుకు అవగాహన

చిట్వేలి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :



డ్రోన్ వివరాలను తెలుపుతున్న అధికారి సుధాకర్.

స్థానిక మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు "సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్" గురించి శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి జి.సుధాకర్ రైతులకి ట్రాక్టర్లు,స్ప్రేయర్స్, ట్రాక్టర్‌తో ఉపయోగించే పరికరాలు, హార్వెస్టర్స్, డ్రోన్స్, డ్రిప్ పరికరాలు ఆలాగే సుష్మ పోషకాలు, బయో పేస్టిసైడ్ పై జీఎస్టీని ఎస్. టి 5 శాతానికి తగ్గించడం జరిగిందని తెలిపారు. తగ్గిన జిఎస్టి ధరలు సెప్టెంబర్ 22 నుండి అమలులో ఉన్నాయని, ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే 1915 నెంబర్ కి ఫిర్యాదు చేయాలని తెలిపారు.తదుపరి స్టాల్స్, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖధికారి లోకేష్,గ్రామ సర్పంచ్ ప్రతినిధి చంద్ర మోహన్, ఉద్యాన సహాయకులు ఓబయ్య, కళ్యాణ్, విఆర్ఓ భాస్కర్, కార్యదర్శి జయలత,ఆదర్శ రైతు కృష్ణంరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ రాఘవేంద్ర

రాజంపేట,అక్టోబర్3 ప్రభాతవార్త



పార్టీలో చేరిన రాఘవేంద్ర

రాజంపేట మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ రేనాటి రాఘవేంద్ర వర్మ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మన్నూరు నుంచి రాఘవేంద్ర గెలిచారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివి ఎన్ మాధవ్ సమక్షంలో రాజంపేటకు చెందిన పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఆధ్వర్యంలో రాఘవేంద్ర బిజెపి పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ నాయకులు బిజెపి పార్టీ పతాకాన్ని రాఘవేంద్రకు వేసి ఆహ్వానించారు. పార్టీకోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. బిజెపి సిద్ధాంతాల మేరకు రాజంపేట పట్టణంలో పార్టీ అభివృద్ధి కోసం తనవంతు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని రాఘవేంద్రవర్మ పేర్కొన్నారు.

## ఓటు చోర్‌కు చెక్‌తోనే రాజ్యాంగం రక్షణ సాధ్యం

### ప్రొద్దుటూరు కాంగ్రెస్ ఇంచార్జ్ ఎస్ ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు అక్టోబర్ 3 ప్రభాతవార్త



భారత రాజ్యాంగం రక్షించబడాలంటే ఓటు చోరీ కి చెక్ పెట్టడమే నని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎస్ ఇర్ఫాన్ భాష తెలిపారు. శుక్రవారం ఓటు దొంగ గద్దె దిగు" అనే నినాదాలతో సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని ఈశ్వర్ రెడ్డి నగర్ లో ఇంటింటికీ వెళ్లి ఓటు చోరీల గురించి ప్రజలకు చేనేత రాలే ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజాస్వామ్యం బలపడాలంటే ఓటుకున్న విలువను కాపాడాలన్నారు. ఎన్నికల్లో జరుగుతున్న ఓటు చోరీలు దేశ భవిష్యత్తుకు ముప్పు అని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత" అని స్పష్టం చేశారు. "ఓటు చోరీని అరికడదాం – రాజ్యాంగాన్ని కాపాడుకుందాం" అనే శక్తివంతమైన నినాదాలతో ఉత్సాహం ప్రజల్లో నెలకొందన్నారు. ప్రజలే కాంగ్రెస్ బలం, ప్రజలే మా ఆశ్రయం అని ఇర్ఫాన్ బాషా స్పష్టం చేస్తూ, కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరీ అప్పపోగుల ఎల్లయ్య, నాయకులు మోలాలి, ఖలందర్, గౌస్, చెన్నూరు అబ్బాస్ మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీ ని కలిసిన సుండుపల్లె నాయకులు..

సుండుపల్లె, అక్టోబర్ 03, ప్రభాతవార్త:

అక్రమ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని గురువారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసామని సుండుపల్లి మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు చంద్రనాయక్ తెలియ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో వైఎస్ఆర్సిపి బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు శేఖర్ రెడ్డి, మడితాడు గ్రామం మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి పరామర్శ

కె.వి పల్లి అక్టోబర్ 3 ప్రభాతవార్త:



మండలంలోని వగళ్లకు చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ సివి మోహన్ రెడ్డి మాతృమూర్తి మృతి చెందడంతో సివి మోహన్ రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించారు. కర్మ క్రియలకు హాజరైన మాజీ మంత్రి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ వెంకటరమణారెడ్డి జడ్పిటిసి గజ్జల శృతి యువజన కన్వీనర్ గజ్జల సీన్ రెడ్డి వైసిపి నాయకులు సీకే ఎర్రం రెడ్డి వెంకట సిద్ధులు జయరామయ్య తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి సన్నిధిలో ఎంపీ కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 03 ప్రభాతవార్త



శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు సతీమణి ఆయన కుమారుడు కోడలు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వీరికి , తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, పూర్వపు మఠాధిపతి కుమారుడు శ్రీ దత్తాత్రేయ స్వామి,టిడిపి నాయకులు పూజ శివ యాదవ్, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి,మేకల సుధాకర్, బిజెపి మండలాధ్యక్షుడు చంద్ర ఓబుల రెడ్డి , పుట్టాల శివ ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం జగన్మాత శ్రీ ఈశ్వరి దేవి అమ్మవారిని వారు దర్శించుకున్నారు. అనంతరం శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వాముల వారిని దర్శించి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, జగన్మాత ఈ శ్రీ ఈశ్వరి దేవి అమ్మవారి చరిత్ర గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ కుటుంబ సభ్యులను కు ప్రసాదాలు అమ్మవారి చిత్రపటంను అందజేశారు.

## నాలుగు వాహనాలు ఢీ ఇద్దరికి గాయాలు

పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త :



నాలుగు వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు దంపతులు గాయపడ్డ సంఘటనకు వివరాలు.. కర్నూలుకు చెందిన ఎతేంద్ర, అరుణాదేవి శుక్రవారం కారులో చిత్తూరుకు వెళుతుండగా పీలేరు మండలం కోళ్లఫారం గ్రామం వద్ద చిత్తూరు నుంచి వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు వెనుక వస్తున్న లారీ, ఆటో ఒకదాని వెనుక ఒకటి వెనుక నుంచి ఢీ కొనాయి. కారులో వెళుతున్న దంపతులిద్దరు గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీలేరు పోలీసులు తెలిపారు.

## నూతన జీఎస్టీతో రైతులకు అద్భుతమైన పొదుపు

పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త :



జీఎస్టీ పై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలం కాకులారం పల్లి గ్రామపంచాయతీ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపు వలన రైతులకు ఎంతో ఉపయోగకరమని పీలేరు వ్యవసాయ శాఖ ఏవో ఓ. రమాదేవి అన్నారు. వ్యవసాయపనిముట్లపై గతంలో 18 శాతం జిఎస్టి ఉండేదని దానిని ఐదు శాతానికి తగ్గించడంతో వ్యవసాయం చేసుకునే రైతులకు ఎంతో ఉపయోగకరమని ఆమె తెలిపారు. సూక్ష్మ పోషకాలు బయో పెస్టిసైడ్స్ బిందు సేద్య పరికరాల పైన 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారని ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఐఏ జహ్నవి రెడ్డప్ప రెడ్డి నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త :



చిత్తూరు జిల్లా ఎదురు కుప్పం మండలం దళం పేటలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి నా సతీష్ నాయుడు తో పా టీ అతను అనుచరులను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని మాల మహానాడు తరపున మేము డిమాండ్ చేస్తున్నాము కూటమి ప్రభుత్వములో దళితులపైన దళిత నాయకులు పైన విచ్చలవిడిగా దాడులు చేస్తూ కూటమి ప్రభుత్వం నాయకులు చనక ఆనందాన్ని పొందుతున్నారు ఈ ఆనందం చాలా రోజులు ఉండదని దళితులంతా ఏకమై కూటమి ప్రభుత్వానికి కూటమి నాయకులకు సరైన బుద్ధి చెబుతారని తెలియజేస్తున్నాను దళితులంటే పట్టణ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను ఎలా ప్రగతి పదములో నడిపిస్తుందని హరి ప్రశ్ని ంచారు . శుక్రవారం సాక్షాత్తు భారత రాజ్యాంగ సృష్టికర్త బాబాసాహెబ్ కు కూటమి ప్రభుత్వములో రక్షణ లేకుండా పోయింది అంబేద్కర్ విగ్రహంకు రక్షణ కల్పించలేని ఈ కూటమి ప్రభుత్వం దళితులకు ఎంత మాత్రమూ రక్షణ కల్పిస్తుందని మాల మహానాడు సంఘము తరపున డిమాండ్ చేస్తూ అడుగుతున్నాను. ఈ కార్యక్రమంలో.. చింతపర్తి సహదేవ రామకృష్ణ సహదేవయ్య శ్రీనివాసులు గంగాధర, చంద్ర, హరి, గిరి, కృష్ణయ్య పాల్గొన్నారు

## ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన మాసం రఫీ

పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త :



అక్రమ కేసులో అరెస్టయి బెయిల్ పై విడుదలైన రాజంపేట పార్లమెంటు సభ్యులు ఎంపీ మిథున్ రెడ్డిని వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాసూమ్ రఫీ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం లోనే కాకుండా రాష్ట్ర పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం సాయి శక్తుల కృషిచేసి రాబోయే స్థానిక ఎన్నికలలో ప్రతి అభ్యర్థి గెలిపించేందుకు కృషి చేస్తానని రఫీ తెలిపారు

## బోరుకు కొత్త మోటారు ఏర్పాటు

కలికిరి, అక్టోబరు 3, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ కడియవాండ్లపల్లెలో శుక్రవారం స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి గంగాదేవీలు గ్రామంలోని రక్షిత మంచినీటి బోరుకు కొత్త మోటారు ఏర్పాటు చేసి మంచినీటి సమస్య పరిష్కరించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరు మోటారు మరమ్మతులకు గురైె గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. దీంతో సర్పంచ్, కార్యదర్శి గ్రామంలోని బోరుకు కొత్త ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయ్యింది.



## వైఎస్ఆర్సిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గామాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి

మదనపల్లి అక్టోబర్ 3 ప్రభాతవార్త



తిప్పారెడ్డిని సత్కరిస్తున్న వైస్ చైర్మన్ జింక చలపతి

వైఎస్ఆర్సిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ (ఎస్ఈసి)గా మదనపల్లి మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి నియామకం అయ్యారు. బుధవారం వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం నుండి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ మెంబర్‌గా తిప్పారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లి నియోజకవర్గంలో పేదల డాక్టర్ గా గుర్తింపు పొందిన తిప్పారెడ్డి వైఎస్ఆర్సిపి ఆవిర్భావం నుండి మదనపల్లి నియోజకవర్గంలో ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్నారు. వైసీపీ ఆవిర్భావం అయిన మొదటి సంవత్సరం 2011లో జరిగిన చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి నుండి ఆయన విజయకేతనం ఎగరవేశారు. ఆ తర్వాత 2014లో మదనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరపున పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఐదేళ్లపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలకు ముఖ్య అనుచరుడిగా పనిచేశారు. పెద్దిరెడ్డి కుటుంబానికి వీర విధేయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మదనపల్లి నియోజకవర్గంలో బలమైన రాజకీయ నేతగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఒకపక్క డాక్టర్ వృత్తిలో ఉంటూ, మరోపక్క రాజకీయ నాయకుడిగా పనిచేస్తున్నారు. ఈయన ప్రజా బలాన్ని గుర్తించిన వైఎస్ఆర్సిపి అధిష్టానం ఎంతో కీలకమైన సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ మెంబర్ గా నియమించారు. తిప్పారెడ్డి నియామకంతో మదనపల్లి నియోజకవర్గంలోని వైఎస్ఆర్సిపికి ఎంతో బలం వచ్చింది. తిప్పారెడ్డి నియామకంతో అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనను నియమించడంలో కృషిచేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలకు తిప్పారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డిని మున్సిపల్ వైస్ చైర్మన్ జింక చలపతి. వలసపల్ నాగరాజు రెడ్డిలు ఘనంగా సత్కరించారు.

## రీ సర్వేపై అవగాహన ర్యాలీ

కలికిరి, అక్టోబరు 3, ప్రభాతవార్త:



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ పర్యవేక్షణలో నిర్వహించిన రీ సర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామ సభ విజయవంతమైంది. మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో 5వేల ఎకరాలు రైతుకు సంబంధించిన భూములు రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రీ సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులను నియమించడం జరిగింది. రీ సర్వేలో రైతులు అధికారులకు అందించాల్సిన పత్రాలు సంబంధించి గ్రామసభలో వివరించడం జరిగింది. ఈ గ్రామసభ స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణారెడ్డి, మండల సర్వేయర్ రెడ్డప్ప, వీఆర్వో సురేష్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్లు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త;



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సత్యం, అహింస ఆయుధాలుగా శాంతి సహనం కవచాలుగా చేసుకుని స్వాతంత్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోషించి భావ జాలం యొక్క ఔన్న త్యాన్ని ప్రపంచమతటికి తెలియజేసిన మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంలో గ్రామ ప్రథమ పౌరురాలు సర్పంచ్ మహిత ఆధ్వర్యంలో చింతపర్తి గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో గాంధీ జయంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం సత్యం, శాంతి, మార్గాలకు స్ఫూర్తిగా తీసుకొని యువత ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టి సమాజ నిర్మాణానికి స్ఫూర్తిగా తీసుకున్నప్పుడే భారతదేశానికి నిజమైన స్వాతంత్రమని ఆయన కొనియాడారు. అనంతరం గ్రామంలో వృద్ధాప్యంలో పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన వారి కుటుంబాలకు ఒక ఇంటికి ఒకే పెన్షన్ అన్న విధానంలో ఆర్థిక భద్రత కల్పించేందుకు వారి జీవిత భాగస్వామికి పెన్షన్లు అంద చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత త్రాగునీరు, సిమెంట్ రోడ్లు గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించినట్లు ఆయన తెలిపారు. వాల్మీకిపురం మండలం గొల్లపల్లిలో విరుపాక్షమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు, నల్లారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ఆర్ఎంపి క్లినిక్ సీజ్

దువ్వూరు, అక్టోబర్ 03, ప్రభాతవార్త:



మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో వైద్య శాఖ నిబంధనలు పాటించని ఆర్ఎంపి క్లినిక్ ను శుక్రవారం సీజ్ చేసినట్లు దువ్వూరు వైద్యాధికారి సురేష్ బాబు తెలిపారు. గుడిపాడు లోని రామ్మోహన్ ఆర్ఎంపి క్లినిక్ లో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందజేస్తున్నారని తెలియడంతో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. ఈ క్లినిక్ లో పరిమితికి మించి వైద్యం రోగులకు అందిస్తున్నట్లు స్పష్టంగా బయట పడిందన్నారు. అదేవిధంగా యాంటీ బయోటిక్స్, సెలైన్ బాటిల్స్, సెలైన్ కు ఉపయోగించే మంచాలు, ఆక్సిజన్ సిలిండర్లు, పిల్లలకు నెబు లైజర్లు పెట్టడం అలాగే వాడిన వైద్య సామాగ్రిని కనుగొన్నామన్నారు. ఆర్ఎంపీలు తమ పరిమితులకు మించి రోగులకు వైద్య సేవలు అందజేయడం స్పష్టంగా కనబడుతున్నందువలన సీజ్ చేసినట్లు తెలిపారు. సరైన అనుమతులు, అర్హతలు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగుల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే సీజ్ చేశామని అనంతరం కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, చంద్రమోళి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా పరదేశి స్వామి తిరుణాల్లోత్సవం.

చిట్వేలి, అక్టోబర్ 3, ప్రభాతవార్త:



స్థానిక మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామం నందు జీవ సమాధితో శివైక్యం పొందిన అవధూత శ్రీ పరదేశి స్వామి తిరుణాల మహోత్సవాన్ని గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. దసరా మొదలు పది రోజులు పాటు గంగమ్మ రూపాన్ని కుండలో ప్రతిష్టించి, శ్రీరంగనాయకుల స్వామిని, పరదేశి స్వామిని, గంగమ్మ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలవడం ఇక్కడ సంప్రదాయం. దసరా ముందు రోజు స్వామివారి ఊరేగింపును నిర్వహించి, దసరా రోజు వేకువజామున పార్వేట ఉత్సవం ఘనంగా చేపట్టారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి నామధేయంతో అధిక మంది వ్యక్తులు గ్రామంలో ఉండడం విశేషం.

## గుంతల మాయమైన రోడ్డు

కలసపాడు, అక్టోబర్2 ప్రభాతవార్త:

మండలంలోని రోడ్డులో గుంతలు పడడంతో ఇబ్బందులు పడుతున్నారని వాహనదారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వాహనదారులు విలేకరులతో మాట్లాడుతూ అధికారులు ఆ గుంతలను చూసిన పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారన్నారు. ఈ రోడ్డును అధికారులు పట్టించుకోని రోడ్డును బాగు చేయాలని కోరారు.

## గ్రామాలలో రీ సర్వే

పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 2ప్రభాతవార్త:

పోరుమామిళ్ల మండలం లచ్చంపల్లి రెవిన్యూ విలేజ్ , బుచ్చింపల్లె చిన్నాయపల్లె గ్రామాలలో శుక్రవారం రీ సర్వే ప్రారంభించారు. తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ లు మండల సర్వే తాలూకా సర్వే , రెవెన్యూ సిబ్బంది , గ్రామ ప్రజలు తో కలిసి సమావేశం నిర్వహించారు.

## డిజిటల్ బుక్ ప్రారంభం

పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులను పెడుతూ జైలుకు పంపుతూ భయభ్రాంతులను చేస్తూ వైసిపి కార్యకర్తలపై దౌర్జన్యాలు చేస్తున్నారని మాజీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వం సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు అధికార పార్టీకి పూర్తిగా కొమ్ముకాస్తున్నారన్నారు. వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించడం జరుగుతున్నదని అందులో భాగంగా పోరుమామిళ్ల మండలం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ను ప్రారంభించామన్నారు. ఈ డిజిటల్ బుక్కును ఉపయోగించుకోవాలని, పోరుమామిళ్ల మండలంలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో సురేష్, రాజారెడ్డి, ఎంపిటీసీ మహబూబ్ బాషా, డాక్టర్ మాబు, వార్డు మెంబర్ హుస్సేన్ పీరా, జెకె.మస్తాన్, శేఖర్ ప్రసాద్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా హబీబ్ బాష ఏకగ్రీవం

పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:



రుఖయ్య మస్జిద్‌లో శుక్ర వారం అంజుమన్ కమిటీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రతి ఒక్కరిని, ప్రముఖులను, మస్జిద్ కమిటీలను ఆహ్వానించగా అందరూ పాల్గొన్నారు. సభలో సభ్యుల సమక్షంలో హబీబ్ బాషని అంజుమన్ కమిటీ కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిని ఎన్నుకున్న వెంటనే, అదే సమావేశంలో కొత్త కమిటీ సభ్యులను కూడా తక్షణమే ఎన్నుకొని ప్రకటించారు. ఈసారి ఎన్నికలు గతంలోలాగా గందరగోళం లేకుండా, శాంతియుత వాతావరణంలో సజావుగా పూర్తయ్యాయి. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు, కమిటీ సభ్యులు సమాజ అభివృద్ధి, ఐక్యత , మస్జిద్ సేవ కోసం కృషి చేస్తామని తెలిపారు.

## విదేశీ ఉత్పత్తులు వద్దు స్వదేశీ ఉత్పత్తులనే వాడాలి

వేంపల్లె: అక్టోబర్ 03 (ప్రభాత వార్త):



విదేశీ ఉత్పత్తులు లేకుండా స్వదేశీ ఉత్పత్తులనే వాడాలని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు సుష్మా పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఆత్మ నిర్బర్ భారత్ అభియాన్ స్వదేశీ ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పట్టణంలోని రజక వీధిలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు సుష్మా ప్రజలతో కలిసి ఇంటింట స్వదేశీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడంతోపాటు ఉత్పాదకులను ఆర్థికంగా స్వావలంబనను సాధించడమే లక్ష్యం అన్నారు. మహాత్మా గాంధీ ఈ స్వదేశీ ఉద్యమాన్ని భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక కీలకమైన భాగంగా నడిపించారని తెలిపారు. గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో చెప్పినటువంటి విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు మరింత ముందుకు తీసుకుపోయేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్వదేశీ ఉద్యమ కార్యక్రమానికి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇంటింటా స్వదేశీ ఊరంతా స్వదేశీ అని తెలుపుతూ కర పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో బిజెపి మాజీ మండలాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, శ్రీనువాసుల తదితరులు పాల్గొన్నారు.

## వైస్సార్ మెమోరియల్ పార్క్ అభివృద్ధి పెంచాలి

వేంపల్లి: అక్టోబర్ 03 (ప్రభాత వార్త):



వైయస్సార్ మెమోరియల్ పార్క్ అభివృద్ధి వేంపల్లి ప్రజలకు చాలా అవసరం అని, అన్ని సౌకర్యాలు ఉన్న కూడా పంచాయతీకి భారంగా ఎందుకు మారిందో అర్థం కావడం లేదని ప్రతి నెల 50,000 రూపాయలకు పైగా అదనంగా భారం పడుతున్న ప్రజలకు సరిగ్గా సద్వినియోగ పడడలేదు. దాదాపు 12 మంది కి పైగా కార్మికులు పని చేస్తుతున్నారని, అంగట్లో అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లు ఉంది పార్క్ దుస్థితి అని, రోజు కి సుమారు 1000రూపాయలు టికెట్ పై వసూలు అవుతున్న వాటి పై సరైన రికార్డులు లేవని, వసూలు అయిన మొత్తం పంచాయతీ కి అందుతుందో లేదో తెలియాలి అని పార్క్ ని పర్యవేక్షించిన జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్. హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి సుష్మ మరియు ఐటీడీపి నియోజకవర్గ కోఆర్డినేటర్ చైతన్య, పులివెందుల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లి, జనసేన మండల నాయకులు పోతిరెడ్డి జయచంద్ర, పసుపులేటి శ్యాం, మనోజ్, దేవా, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంను ఢీ కొన్న బస్సు

సుండుపల్లె, అక్టోబర్ 03, ప్రభాతవార్త:



మండల పరిధిలోని మడితాడు వంక దగ్గర రోడ్డు ప్రమాదం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఎదురేదురు ఢీ కొనడంతో రాయవరం నుండి రాయచోటికి వెళుతున్న ఆర్టీసీ బస్సు మడితాడు నుండి రాయవరం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనదరుడు చంద్రాజుగారిపల్లికి చెందిన సుధాకర్ (55)గా గుర్తింపు స్థానికులు గాయపడిన వ్యక్తిని రాయచోటి ఆసుపత్రికి తరలించారు.ప్రమాద సంఘటన పై పోలీసులకు సమాచారం ఇవ్వగా ప్రమాద సంఘటనపై విచారణ చేపట్టారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై అవగాహన

**తొండూరు అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



మండలంలోని తొండూరు గ్రామంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి బస్టాండు వరకు వ్యవసాయ శాఖ అధికారి కే. రాజు, అనుబంధ శాఖలు ఆధ్వర్యంలో రైతులతో కలిసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ లో భాగంగా వ్యవసాయ పరికరాలు పైన జిఎస్టి తగ్గింపులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వ్యవసాయ ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు విడిభాగాలు, డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్లు, వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, ఆక్వాకల్చర్ పరికరాలు, పాల క్యాన్లు మరియు 12 రకాల బయో పెస్టిసైడ్స్ వివిధ రకాల వస్తువులు పైన గతంలో ఉన్న 12 శాతం జిఎస్టి నుంచి ప్రస్తుతం 5 శాతానికి తగ్గడం వల్ల రైతాంగానికి ఆర్థికంగా ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ తగ్గిన జిఎస్టి వివరాలను రైతులకు తెలియజేసి రైతులు సద్వినియోగం చేసుకొని పంటల ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్. తరుణ్ చంద్రారెడ్డి వ్యవసాయ సాంకేతిక సంస్థ వారు మరియు సతీష్ గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు మండల పశు వైద్యాధికారి, సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ ఎం రామ్మోహన్రావు జెడ్ బిఎన్ఎఫ్ సిబ్బంది మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ భాగస్వామ్యంతోనే జ్వరాల నియంత్రణ

**లక్కిరెడ్డిపల్లి; అక్టోబర్ 3 ప్రభాతవార్త**



సమాజ భాగస్వామ్యంతోనే మలేరియా మరియు ఇతర వ్యాధులను అరికట్టవచ్చని మల్యాలయ అధికారి జి. జయరాం పేర్కొన్నారు శుక్రవారం పందిళ్ళపల్లిలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్గున్యా, మెదడువాపు జ్వరాలను నియంత్రణ మరియు వ్యాప్తి ని అరికట్టవచ్చు అన్నారు. స్థానిక పి.హెచ్.సి సిబ్బందితో కలసి డాక్టర్ ఆధ్వర్యంలో ఇంటింటి లార్వా సర్వే నిర్వహించడం జరిగింది. ఈ ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదం మలేరియా వ్యాధిని .తీవ్రజ్వరం చలి,తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్ల పక్కకు తిప్పలేకపోవడం, శరీరంపై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయి. వ్యాధి లక్షణాలు ను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని,సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదుఅనితెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి. రవీంద్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్. ఓబిలేష్. ఆరోగ్య కార్యకర్తలు సుభాషిణి, శైలజ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జియస్‌టీపై గ్రామసభలు

**చిన్నమండెం అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



మండలంలో అన్నీ గ్రామ పంచాయతీల లో జిఎస్‌టీ మీద శుక్రవారం గ్రామ సభలు మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది. రైతు సేవా కేంద్రంలో వండాడి గ్రామ పరిధిలో వ్యవసాయ పనిముట్లపై జిఎస్ టీ తగ్గింపు అవగాహనా కలిపిస్తున్న అధికారులు, APMIP పీడీ, వ్యవసాయ అధికారి, ఉద్యాన శాఖ అధికారి అధ్యక్షతన ట్రాక్టర్ ర్యాలీ, గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, డ్రిప్ పరికరాలు, బయో పెస్టి సైడ్స్, డ్రోన్లు మరియు ఎలక్ట్రానికి పరికరాల మీద జిఎస్ టీ 12 నుంచి 5 తగ్గించారాని పోస్టర్లు, ట్రాక్టర్ ర్యాలీ ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## అప్పుల బారిన పడి రైతు ఆత్మహత్య

**తొండూరు అక్టోబర్3 ప్రభాతవార్త :**

తొండూరు మండలంలోని మల్లేల గ్రామానికి చెందిన యువ రైతు దొడ్డి శ్రీనాథ్ (28) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో కుటుంబ భారాలు మోస్తూ కష్టపడి చదువు పూర్తిచేసుకున్నాడు. అయితే జీవనోపాధి కోసం వ్యవసాయం వైపు మొగ్గు చూపిన శ్రీనాథ్, సాగు చేయడానికిఅప్పులుచేయాల్సి వచ్చింది. కాలానుగుణంగా పంటల ఖర్చులు పెరగడం, ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. తాను చేసిన రుణాలు ఎలా తీర్చాలో అర్థంకాక, తీవ్ర ఆవేదనకు లోనైన అతడు చివరికి విషద్రావణం సేవించి మృతి చెందాడు. ఈ దారుణ ఘటనతో మల్లేల గ్రామంలో విషాదఛాయలుఅలుముకున్నాయి. శ్రీనాథ్ మరణం కుటుంబ సభ్యులను, గ్రామస్థులను కంటతడి పెట్టించింది. రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి, బాధిత కుటుంబాలకు చేయూతనివ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## సీఐ లింగప్పకు ఘన సన్మానం

**బద్వేల్ అర్బన్ అక్టోబర్ 03 ప్రభాతవార్త :**

దసరా శరన్నవరాత్ర మహోత్సవంలో బద్వేల్ పట్టణంలో గత 12 రోజులు పాటు దసరా ఉత్సవాలు ఎక్కడ కూడా ఎటువంటి అవాంఛ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ లింగప్ప తమ పోలీస్ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం పట్ల ఉత్సవాలు అంగరంగ వైభవ నిర్వహించడం జరిగిందని ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్య క్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు కనుమరర్లపూటి ప్రసా ద్, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, ట్రెజరర్ భూపాలం నాగరాజారావు అన్నారు, దసరా ఉత్సవాలలో అనేకమంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవ దానికి ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అమ్మవారి శాల వద్ద సిఐ లింగప్ప, ఎస్సై జయరామిరెడ్డిలు నిరంతరాయంగా తమ పోలీస్ సిబ్బంది ద్వారా ఎక్కడ ఎటువంటి అవాంఛ సంఘటనలకు చోటు చేసుకోకుండా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడానికి ఎంతగానో కృషి చేశారని సీఐ లింగప్ప కు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా పూలమాలతో సత్కరించి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు,బద్వేల్ పట్టణంలో విజయదశమి పురస్కరించుకొని వాసవి మాత అమ్మవారు పురవీధులలో దర్శనమిచ్చారు. అలాగే శమీ దర్శనంలో కానీ ఎక్కడ ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం మరియు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రతిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం వలన పలువురు ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో వాసవి మాత అమ్మవారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకోవడం జరిగింది,ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**

సబ్‌కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న సబ్‌స్టేషన్‌కు శనివారం మరమ్మత్తులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డిఈ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గాంధీరోడ్డు, నెహ్రూబజార్, ఈశ్వరమ్మకాలనీ, ఎన్‌విఆర్‌లేవుట్, నిమ్మనపల్లె రోడ్డు, కమ్మగడ్డవీధి, రోజాప్లాట్స్, బర్మావీధి, శేషమహల్, చిత్తూరు బస్టాండు పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

# సూపర్ జీఎస్టీతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు : ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు అక్టోబర్ 03, ప్రభాతవార్త**

దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకు వచ్చిన సూపర్ జీఎస్టీతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరడమే కాకుండా రైతు జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆదాయం రెట్టింపు అవుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో వ్యవసాయ శాఖ జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ల ర్యాలీ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ట్రాక్టర్ లో ర్యాలీ ముందుగా స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణం నుండి శివాలయం మీదుగా జిన్నా రోడ్డు వరకు తిరిగి మార్కెట్ యార్డు వరకు కొనసాగింది అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రకటించిన సూపర్ జీఎస్టీ వల్ల 12 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడంతో వ్యవసాయ యంత్రాలపై ధరలు తగ్గి రైతు జీవన ప్రమాణాలు మెరుగుపడడమే కాకుండా ఆదాయం రెట్టింపు కావడానికి అవకాశం ఉందన్నారు. ప్రధానంగా ట్రాక్టర్లకు ఏడు శాతం వరకు రైతులకు మేలు జరుగుతుందని ట్రాక్టర్ విడిభాగాలలో 13 శాతం వరకు డ్రిప్ ఇరిగేషన్ మరియు స్పింక్లర్లపై ఏడు శాతం వరకు వ్యవసాయ యంత్రాలపై ఏడు శాతం వరకు డ్రోన్లపై 13 శాతం వరకు ఆక్వా కల్చర్ పరికరాలపై ఏడు శాతం 12 రకాల బయో జస్టిసైడ్స్ పై ఏడు శాతం పాల క్యాడ్లపై ఏడు శాతం మరియు వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు పనిముట్లపై ఐదు శాతానికి జీఎస్టీ తగ్గించి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వాన్నిదని ఆయన కొనియాడారు. రైతులు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్టీ పై అవగాహన పెంచుకొని ఏవైనా వ్యవసాయ ఆధారిత పరికరాలను కొనుగోలు చేసే ముందు తగ్గిన జీఎస్టీ ప్రకారం



కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు అంతేకాకుండా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఉచిత బస్సు పథకాన్ని ఇప్పటికే ప్రారంభించామని ఉచిత సిలిండర్లు సామాజిక పింఛన్లు అమలు చేసినట్లు తెలిపారు. అలాగే శనివారం ఆటో డ్రైవర్ల సేవలో ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి మాజీ జెడ్పిటిసి తోట మహేశ్వర్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్, జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానేంద్ర రెడ్డి మరియు జిఎస్టి అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు వక్ఫ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్ పట్టణ బిజెపి అధ్యక్షులు వంకధార నరేంద్రరావు ప్రధాన కార్యదర్శిలు చెన్నా మోహన్, ముత్యాల శ్రీశ్రీ గోశాల అధ్యక్షులు శివ నాగిరెడ్డి జనసేన నాయకులు జిలాన్ మరియు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

**రామసముద్రం అక్టోబర్ 3ప్రభాతవార్త**



మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రా్మ లో వెలిసిన మారేమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మ వారికి పలురకాల పుష్పాలు, వేపాకుతో అలంకరణ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అబిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి శీనప్ప భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో గ్రామస్థులు భజన కార్యక్రమం నిర్వహించారు.

## జిఎస్టి తగ్గింపు అవగాహన కార్యక్రమం

**రామసముద్రం అక్టోబర్ 3 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని అన్ని రైతు సేవ కేంద్రాలు, ఫర్టిలైజర్స్ నందు శుక్రవారం ఎంపిడివో లతీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం తగ్గించిన 12 శాతం నుంచి 5 శాతానికి జిఎస్టి తగ్గించడం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు , జి ఎస్టి వల్ల వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్, ట్రాక్టర్ టైర్లు,డ్రిప్ పరికరాలు, కిసాన్ డ్రోన్, పాలక్యాన్స్ వంటి వాటి మీద 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, వ్యవసాయాధికారి జాఫర్, పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్, అధికారి సురేష్, రాంమూర్తి,రైతులు,పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే

**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



కలెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శాలువకప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న రెవెన్యూ, భూ సమస్యలపై ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పిజిఆర్‌ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్ పి ధీరజ్‌ను ఎమ్మెల్యే కలసి శాలువతో సత్కరించారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య శాంతిభద్రతలపై ఎమ్మెల్యే జిల్లా ఎస్‌పి దృష్టికి తెచ్చారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు.

## 14న విజయవాడలో మహాధర్నా

**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**

రూరల్ మండలంలోని అంకిశెట్టిపల్లికు సమీపంలో బుద్దినికొండపై బుద్దిని విగ్రహానికి ఇనుకకంచె వేసి మూడు నెలలుగా బందించి అవమానించడం, పూజలను నిషేదించడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 14న విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు బాస్ నేత పిటిఎం శివప్రసాద్ తెలిపారు. అదే విధంగా నవంబర్ 26న ఛలో ఢిల్లి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బుద్దినికొండపై పూజలకు ఎవరూ వెళ్ళకూడదంటూ తహశీల్దార్ ఉత్తర్వులు జారీ చేయడంతోనే ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విజయదశమి రోజున అంబేద్కర్ ధమ్మా దీక్ష సందర్బంగా గురువారం బుద్దినికొండపై పూజలు నిర్వహించుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చినా రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం శోచనీయంగా ఉందన్నారు. విజయవాడలో జరిగే మహాధర్నా, దేశవ్యాప్త ఆందోళనకు బాస్ లీడర్లు సిద్దం కావాలని, బౌద్ద సంఘాలను, అంబేద్కర్ సంఘాలను, దళిత వామపక్ష, ప్రగతిశీల, ప్రజాసంఘాలను, అంబేద్కర్‌వాద రాజకీయ పార్టీలను నేరుగా కలసి మద్దతు కోరాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా మహాత్మగాంధీ జయంతి

**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



నివాళులర్పిస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలో తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఏర్పాటుపైన పాలకులకు కనువిప్పు కల్పించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులచే గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. జిల్లా సాధన కోసం గత రెండేళ్ళుగా అనేక పోరాటాలు చేసినా ఎన్నికలకు ముందు కూటమి నేతలు జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదన్నర అవుతున్నా ఇంతవరకు జిల్లాగా ప్రకటించలేదన్నారు. మహాత్మగాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మీనా కుమారి, నాయకులు ఎస్‌కె.బాషా, షరీఫ్, మహబూబ్‌ఫీర్, శరత్‌కుమార్‌రెడ్డి, మహమ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## దాసరి బాబుకు ఘన సన్మానం

**మైదుకూరు, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా సీనియర్ న్యాయవాది, టిడిపి పట్టణ అధ్యక్షులు దాసరిబాబుకు శుక్రవారం బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ప్రెసిడెంట్ సోమేశుల శివప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. పలువురు న్యాయవాదులు శాలువా పూలమాలతో సత్కరించారు. రాష్ట్రస్థాయిలో పదవి అలంకరించిన సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమేశుల శివప్రసాద్ ,ఆర్ శ్రీనివాసులు, కామనూరు శ్రీనివాసులు, ఆవుల వెంకటరమణ, నాగిరెడ్డి, కోనేటి శ్రీనివాసులు, బాల వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి, జెకె చారి పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్‌టితో ధరలు తగ్గాయి

**కురబలకోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



సూపర్ జిఎస్‌టిపై అవగాహన సదస్సు

సూపర్ జిఎస్‌టి–సూపర్ సేవింగ్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకువచ్చినప్పటి నుంచి వ్యవసాయ పరికరాలను ధరలు తగ్గాయని కురబలకోట వ్యవసాయశాఖ ఏఓ రజిత తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల క్లస్టర్ పరిధిలో శుక్రవారం రైతులకు సూపర్ జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. ట్రాక్టర్లు, స్ప్రింకర్లు, డ్రిప్, ఇతర విడిభాగాల ధరలు తగ్గాయని వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే : ఎస్ఐ

**కురబలకోట, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డు ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కురబలకోటలో ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ముదివేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైనర్లు రోడ్లుపైకి బైకుల్లో వచ్చి స్టంట్లు చేస్తూ నడుపుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

## దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎం.ఆర్.పి.ఎస్ అన్నమయ్య జిల్లా సీనియర్ నాయకులు, పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ తెలిపారు. శుక్రవారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం, వెదురు కుప్ప మండలం, దేవళంపేటలో ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం యావత్ సమాజానికే అవమానమని చెప్పారు. కుల మతాల ముసుగులో వివక్ష చూపుతూ దళితులను అంటరానివారుగా చూస్తూ అడుగడుగునా దళితులను అవమానిస్తున్న ఇలాంటి నీచ వ్యక్తులకు పోలీసులు సరైన బుద్ధి చెప్పాలన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో మరెక్కడా పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దుండగలపై చర్య తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే మహా జననేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకత్వంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్

**వీరపునాయునిపల్లె, అక్టోబర్ 03, ప్రభాత వార్త,,**



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అని ఏఓ శ్యాం బాబు అన్నారు. శుక్రవారం వీరపునాయునిపల్లె బస్టాండ్ నుంచి వరకు వ్యవసాయ శాఖ మరియు వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో రైతులతో కలిసి వ్యవసాయ పరికరాలు పైన జిఎస్టి తగ్గింపులు గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా వ్యవసాయ ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు విడిభాగాలు, డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్లు, వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు ,ఆక్వాకల్చర్ పరికరాలు, పాల క్యాన్లు మరియు 12 రకాల బయో పెస్టిసైడ్స్ వివిధ రకాల వస్తువులు పైన గతంలో ఉన్న 13 జిఎస్టి నుంచి ప్రస్తుతం 5 కి తగ్గడం వల్ల రైతాంగానికి ఆర్థికంగా ఎంతగానో మేలన్నారు. కార్యక్రమంలో గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారిణి లక్ష్మి మరియు రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**వీరపునాయునిపల్లె, అక్టోబర్ 03; ప్రభాతవార్త;**

మండలంలోని పాలగిరి గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపల్లి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి దేవేందర్ రెడ్డి (19) మృతి చెందాడు మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు ముత్తుకూరు నుంచి దేవేందర్ రెడ్డి అతని స్నేహితుడు వీర కుమార్ రెడ్డి ఇద్దరు బండిలో డీజిల్ కోసం వీరపూనాయుని పల్లెకు వస్తూ ఉండగా పాలగిరి దాటంగా బండిని వెనక వైపు నుంచి లారీ ఢీకొట్టడంతో ముందు వస్తున్న స్కూటీని వీరు కొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో దేవేందర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు వీర కుమార్ రెడ్డికి గాయాలు కావడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## హాస్పిటల్లో అనవసరమైన టెస్టను అరికట్టండి

**బద్వేలు, అక్టోబర్ 3 , ప్రభాతవార్త :**

బద్వేలు మరియు పోరుమామిళ్లలో పలు ప్రైవేట్ ఆస్పత్రులలో అవసరం లేకున్నా టెస్టుల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఈ దోపిడీని సంబంధిత అధికారులు అరికట్టాలని సిపిఐ ఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేలు, పోరుమామిళ్ల పట్టణ కేంద్రాలలో ఉన్న ప్రైవేటు అనుపత్రులలోని మెడికల్ స్టోర్లో జరుగుతున్న దోపిడిని అరికట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ కొరత, ల్యాబ్ కొరతతో ప్రజలు ప్రైవేటు అనుపత్రులను ఆశ్రయిస్తున్నారని ఇదే అదునుగా మెడికల్ స్టోర్లలో దోపిడి అధికమవుతోందని వాపోయారు. అలాగే ట్యాబ్లెట్లపై రాయితీ ఇవ్వకుండా ఎంత దగ్గ ఉంటే అంత తీసుకుంటున్నారని వాపోయారు. అలాగే తనిఖీ చేయాల్సిన డ్రగ్స్ అధికారులు పర్యవేక్షణ కరువైందన్నారు. కొన్ని మెడికల్ స్టోర్లలో దొంగనర్రిఫికెట్లతో నడుపుతున్నారని వీటన్నంటిని పరిగణనలోకి తీసుకుని అయా మెడికల్ షాపులపై చర్యలు చేపట్టాలన్నారు.

## శివాలయంలో రాజంపేట ఇన్చార్జ్ ప్రత్యేక పూజలు

**ఒంటిమిట్ట అక్టోబర్ 03 ప్రభాతవార్త**



ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లి పంచాయతీ కుడమలూరు గ్రామం సరిహద్దుల్లో అతి పురాతనంగా వెలిసి ఉన్న శ్రీ కామాక్షమ్మ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో రాజంపేట నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చమర్తి. జగన్మోహన్ రాజు, కుటుంబ సమేతంగా శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఏలేశ్వరం. బాల గురునాథ శర్మ(బాలు స్వామి) పర్యవేక్షణలో అదనపు అర్చకులు గణపతి పూజ, ఆలయ స్వస్తి పుణ్యా వాచనము, రుత్వి కరణము, స్వామి అమ్మవార్ల ప్రధాన కలశ స్థాపన, వాస్తు, వరుణ కలశ స్థాపన పరమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించడం జరిగింది. నేటి తెల్లవారుజామున 4:00 గంటల నుంచి అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి హోమం, మృత్యుంజయ హోమం, చండీ హోమం, సుదర్శన హోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించి భక్తులకు ఆలయ ప్రవేశం తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. పై కార్యక్రమాలను తిలకించుటకు మండల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి ఆలయ ప్రవేశం గావించి కార్యక్రమాల్లో పాల్గొని మంత్రముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ఆలయమంతా శివనామ స్మరణతో మార్మోగింది.

## పేద కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రం

**గాలివీడు, అక్టోబర్ 3(ప్రభాతవార్త):**



అనారోగ్య సమస్యతో బాధపడుతూ మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన గోల్ల రెడ్డిప్రకాష్‌నాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.3 లక్షల ఎల్‌ఓసీ పత్రం మంజూరైంది. ఈ సహాయాన్ని పొందడానికి బాధితుడి కుటుంబం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న మంత్రి తన సిఫారసుతో ఆర్థిక సహాయం మంజూరయ్యేలా చేపట్టారు. మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని మంత్రి కార్యాలయంలో ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఎల్‌ఓసీ పత్రం అందుకున్న కుటుంబసభ్యులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి, లక్ష్మీప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దాసరి మధుసూదన్‌రెడ్డి, బసిరెడ్డి, నరసారెడ్డి, ఆవులకుంట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

**గాలివీడు, అక్టోబర్ 3(ప్రభాతవార్త):**



రైతుల్లో జీఎస్టీ తగ్గింపులపై అవగాహన కల్పించేందుకు గాలివీడు మండలంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాగ్యలత, మండల వ్యవసాయాధికారిణి గౌతమి ఆధ్వర్యంలో పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం నుండి ట్రాక్టర్ ర్యాలీ చేపట్టి, కరపత్రాల ద్వారా రైతులకు వివరాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ట్రాక్టర్లు, విడిభాగాలు, పంట రక్షణ, పోషణకు సంబంధించిన ఉపకరణాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలపై జీఎస్టీని గణనీయంగా తగ్గించిందని తెలిపారు. దీంతో సాగు ఖర్చులు రైతులకు తగ్గే అవకాశముందని వివరించారు. డీజిల్ ఇంజన్లు, ట్రాక్టర్ విడిభాగాలు, టైర్లు వంటి ఉపకరణాలకు జీఎస్టీ 18 శాతం నుండి 5 శాతం తగ్గింపు చేయబడిందని చెప్పారు. అలాగే స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్‌పరికరాలు, హ్యాండ్ స్ప్రేయర్లపై జీఎస్టీ 12 శాతం నుండి 5 శాతంకు, సూక్ష్మ పోషక పదార్థాలపై 18 శాతం నుండి 5 శాతానికి తగ్గించారని తెలిపారు. రైతులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## పంచలోహ శిలా విగ్రహం బహూకరణ

**గాలివీడు, అక్టోబర్ 3(ప్రభాతవార్త):**



పట్టణంలోని కుషావతి నదీ తీరాన వెలసిన శ్రీ అసర్ల గంగమ్మ ఆలయానికి పంచలోహ శిలా విగ్రహాన్ని దాతలు ఆలయానికి బహూకరించారు. నడింపల్లి గ్రామానికి చెందిన కొంగ లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు నరేంద్ర, వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌లు సంయుక్తంగా రూ.46 వేలు విలువ చేసే 2 అడుగుల ఎత్తు గల ఆసర్ల గంగమ్మ పంచలోహ విగ్రహాన్ని దసరా పర్వదినం రోజు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసర్ల గంగమ్మ గ్రామదేవతగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోర్కెలు తీరుస్తూ కొంగుబంగారంగా విరాజిల్లుతోందని కొనియాడారు. అమ్మవారి కృపాకటాక్షాలతో శిలా విగ్రహాన్ని అందజేయడం జరిగిందన్నారు.

## సిఎం సహాయ నిధి పేదల పాలిట సంజీవని

**పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త ;**



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పలు రకాల ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ దరఖాస్తు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ సంజీవని లాంటిదని పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి సిఫారసు మేరకు 25 మంది లబ్ధిదారులకు రూ.27,56,221 మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కార్యాల యంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యల సమయంలో పేదవాడికి తక్షణ సహాయం ముఖ్య మంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే నియోజకవర్గ పరిధిలో బాధిత కుటుంబాలకు157 మందికి గాను 2కోట్ల 33వేల 266 రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలోని పేద ప్రజలను ఆదుకోవడం, సంక్షేమ పథకాలు అందించడం, వారి సమస్యలు పరిష్కరించడం తమ లక్ష్యమని, బాధితులకు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## ఘనంగా గాంధీ జయంతి

**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



నివాళులర్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని అవెన్యూ రోడ్డులో ఉన్న వైసిపి కార్యాలయంలో గురువారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశాభివృద్దికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మహాత్మగాంధీ చూపిన అహింసమార్గం ఆదర్శనీయమన్నారు. అనంతరం నియోజకవర్గంలో జరిగిన దసరా ఉత్సవాల వేడుకల్లో ఆయన వైకాపా నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, షమీంఅస్లాం, నాయకులు వివిఎస్.రెడ్డి, మలిటరి మల్లికార్జునరెడ్డి, ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లి మహేష్, వినూతాబాయ్, శారదారెడ్డి, షానవాజ్, ఇర్ఫాన్, చరణ్, చిన్నా, అమ్మాజాన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి సందర్భంగా శ్రీవారికి విశేష పూజలు





**బద్వేల్ అర్బన్ అక్టోబర్ 03 ప్రభాతవార్త :**
విజయదశమి పురస్కరించుకొని గురువారం నెల్లూరు రోడ్డులో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ భాదిరెడ్డి వెంకటరామిరెడ్డి మరియు ఈవో పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పూజారి రమేష్ స్వామి స్వామివారికి తెల్లవారుజాము నుండే వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు, సాయంత్రం స్వామివారిని శమీ దర్శనం చేయించేందుకు ప్రత్యేక పల్లకిలో స్వామివారిని తీసుకువెళ్లి శమీ దర్శన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు, అలాగే పట్టణ పరిసర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులందరూ తరలివచ్చి జమ్మి చెట్టు ప్రదక్షిణలు చేసుకొని శమీ దర్శనాన్ని చేసుకున్నారు, స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన పలువురికి స్వామివారి తీర్థప్రసాదాలు తోపాటు పలువురికి ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ శ్రీధర్, జయరాం రెడ్డి, నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది సాంబయ్య, రాజు తోపాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంగరంగా వైభవంగా ప్రొద్దుటూరు దసరా శమీ దర్శనం







**ప్రొద్దుటూరు రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**
దసరా ఉత్సవాల నిర్వహణలో దేశ వ్యాప్తంగా రెండవ మైసూరుగా ఖ్యాతిగడించిన ప్రొద్దుటూరులో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రోజూ ఓ అలంకరణలో అగుపించే అమ్మవారిని దర్శించడం ఒక ఎత్తైతే అన్ని ఆలయాల అమ్మవార్లను ఒకే చోట దశమినాడు శమీదర్శంలో దర్శించడం మరింత ప్రత్యేకత, విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరు పట్టణంలో గురువారం సాయంత్రం శమీదర్శన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విజయానికి, సకలశుభాలకు, సిరిసంపదలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని దశమి నాడు ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వాసవి మాత అమ్మవారి ఉత్సవమూర్తిని కన్నులవిందుగా పట్టువస్త్రాలతో, పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి కొర్రపాడురోడ్డులోని శ్రీ వాసవీ శమీవృక్ష మండపంలో శమీదర్శన మహోత్సవం చేయించారు. శ్రీ మహాలక్ష్మి సమేత చెన్నకేశవాలయం, రాజరాజేశ్వరి ఆల యం, ఆగస్త్యేశ్వరాలయం, ఆత్మా రామ స్వామి, సత్య నారాయణ స్వామి, విజయ నగరంవీధిలోని చౌడేశ్వరీదేవి, పెద్దమ్మతల్లి తదితర ఆలయాల వారు కొర్రపాడు రోడ్డు మిల్లులోని శమీవృక్షం వద్ద దర్శనం చేశారు. కేరళ సింగారిమేళం, డిస్కోలైటింగ్, కళాకారుల నృత్య ప్రదర్శన, బాణసంచా పేలుళ్ల, విద్యుత్ ఆర్చీల వెలుగులు, మంగళ వాయిద్యాల సందడి శమీ దర్శనానికి ప్రత్యేక ఆకర్షణగా భక్తులు అమ్మవారి పాదాల చెంత శమీ వృక్ష పత్రాలను వేసి తమను కాపాడమని, సర్వశుభాలు అనుగ్రహించాలని వేడుకున్నారు. ఒకరికొకరు శమీ వృక్షపత్రాలను ఇచ్చి శుభాలు కలగాలని కోరుకున్నారు. అన్ని ఆలయాల స్వామివారి, అమ్మవారి ఉత్సవ మూర్తులు శమీదర్శనం కోసం కొర్రపాడు రోడ్డుకు చేరడంతో ఆప్రాంతం భక్తసంద్రంగా మారింది. పాలిటెక్నిక్ కళాశాల నుంచి శివాలయం వరకు భక్తులతో కిటకిటలాడింది.

## నిన్న ఆమోదం... నేడు అమలు..

**వేంపల్లి:అక్టోబర్:03(ప్రభాత వార్త)**
గాంధీ జయంతి సందర్భంగా నిన్నటి దినం జరిగిన వేంపల్లి గ్రామ సభలో గ్రామంలోని వైసీపీ,టీడీపీ, జనసేన, బిజెపి,ఆమ్ ఆద్మీ,కాంగ్రెస్ నాయకులు, ముక్తకంఠంతో గ్రామపంచాయతి కార్యదర్శి నాగభూషణరెడ్డి ఆధ్వారం లో సర్వముఖాభివృద్ది నిమిత్తం ప్రవేశపెట్టిన సుమారు 10 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు ఈ సందర్భంగా పారిశుద్ధ కార్యక్రమాల్లో ఈవో వేసే ప్రతి అడుగును తమ వంతు సహాయ సహకారం అందిస్తామని వారు తెలిపారు దాంట్లో భాగంగా గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులను ఆవులను తరలించాలని ప్రతిపాదించారు అందులో భాగంగా శుక్రవారం దాసరి సుబ్బయ్యకు చెందిన సుమారు 80 పందులు ఈవో ఆధ్వర్యంలో తరలించారు ఈ సందర్భంగా నిన్నటి తీర్మానాలను శుక్రవారం నుంచి అమలుపరచాలని ఈవో చర్యలను పలువురు ప్రముఖులు అభినందించారు.

## లోక కళ్యాణ్ మేలా ద్వారా ఆర్థిక అభివృద్ధి

**బద్వేల్ అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వ పథకమైన లోక కళ్యాణ్ మేరా ద్వారా ప్రజలు మరింత ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ బ్యాంకు మేనేజర్ , మున్సిపల్ కమిషనర్ నరసింహా రెడ్డి చేతుల మీదుగా ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ యూనిట్ వారికి ఒక కళ్యాణ్ మేలా కింద చెక్కులు అందజేయడం జరిగినది.పట్టణం లోని గాంధీనగర్ లో ఇద్దరు ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ మైక్రో ఎంటర్ ప్రైజస్ న్యూ యూనిట్స్ పెట్టుకొని జీవనం సాగించేవారు, వారికి మరింత ఆర్థిక తోడ్పటు అందించడంలో భాగంగా యూనియన్ బ్యాంకు బద్వేల్ బ్రాంచ్ వారు ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున లోన్ ఇవ్వడం జరిగింది. అందులో 35 శాతము సబ్సిడీ కలదు. ఇంకనూ ఎవరయినా ఇలాంటి యూనిట్స్ పెట్టుకొని ఉంటే వారు కూడా అప్లై చేసుకోవచ్చునీ, వివరాలకు మెప్మా ఆఫీస్ లో సంప్రదించవచ్చున్నారు.సదరు లబ్ధిదారులను వారం కిందట జరిగిన లోక కళ్యాణ్ మేళా కార్యక్రమములో గుర్తించి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ , మునిసిపల్ కమీషనర్ బ్యాంకు వారికి వారములో లోన్ మంజూరు చేయమని చెప్పడములో భాగముగా ఈ రుణాలు మంజూరు చేయడం జరిగింది.

## విజయవంతమైన క్రికెట్ టోర్నమెంట్

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాత వార్త**



భగత్ సింగ్ జయంతి మరియు దసరా పండుగను పురస్కరించుకొని డీ వై ఎఫ్ఐ అధ్వర్యంలో బద్వేలులో జిల్లా స్థాయి భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. బి జీవేముల వీరారెడ్డి కాలేజీ గ్రౌండ్ నందు ఫైనల్ మ్యాచ్ విజయవంతంగా జరిగిందని విన్నర్స్, రన్నర్స్‌కు బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహ రెడ్డి, బద్వేలు అర్బన్ సిఐ లింగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ లు కప్పులు,మెడల్స్,ప్రైజ్ మని విన్నర్ కు 15000,రన్నర్ కు 10000 ఇవ్వడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంచే క్రీడలు నిర్వహిస్తున్న డీ వై ఎఫ్ ఐ నాయకత్వానికి అభినందనలు అన్నారు.యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా సన్మార్గంలో పుట్టిన దేశానికి,ప్రాంతానికి,తల్లిదండ్రులకు మంచి పేరు,ఖ్యాతిని తేవాలని అన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా యువత ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను తర్మకొట్టాలని ఆ శక్తి ఒక యువతకి మాత్రమే ఉందని అన్నారు.యువత మున్సిపల్,పోలీసు శాఖ కలిసి బద్వేలు అభివృద్ధికి పాటుపడదామని యువత కలసి రావాలని అన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసానికి,ధృడత్వానికి ఎంతో ఉపయోగకరం అన్నారు. ఈ కార్యక్రమం లో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి ముడియం. చిన్ని, బద్వేలు పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ పట్టణ నాయకులు ఓబుల్ రెడ్డి సుధాకర్ సురేష్ నాగేంద్ర సుబ్రహ్మణ్యం చరణ్ పాల్గొన్నారు.



## సిఈసిగా ఎన్నికైన ఎమ్మెల్సీ

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీ ఈ సి) మెంబర్"గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాల , శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ తమ్మిశెట్టి సునీల్, శ్రీనివాసులు రెడ్డి, సుజంత్, సాంబ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

**దువ్వూరు, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**
విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులుగా పనిచేసే వారిని సంస్థలో విలీనం చేసి వారిని రెగ్యులర్ చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ సభ్యులు కోరారు. ఈ విషయంపై ఈ నెల 5వ తేదీ విజయవాడలో జరిగే కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని ఈ సమావేశంలో అందరూ పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా సెక్రెటరీ నాయబ్ రసూల్, అధ్యక్షులు రామసుబ్బయ్య మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణలో భాగంగా కాంట్రాక్ట్ కార్మికుల వ్యవస్థను తీసుకువచ్చి ఇప్పటికే 27 వేల మందికి పైగా కార్మికులను రెగ్యులర్ చేయకుండా వారికి కనీస వేతనం కూడా ఇవ్వలేదన్నారు. రెగ్యులర్ జీతంలో ఐదవ వంతు ఇస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. దశాబ్దాలుగా పోరాడుతున్న విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసి వారిని సంస్థలో విలీనం చేసుకోవాలన్నారు. వీటిపై 5వ తేదీన విజయవాడలో జరిగే సదస్సుకు విద్యుత్ ఉద్యోగులు హాజరై ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశం లో నరసింహులు, శివ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దస్తగిరి స్వామి పవిత్ర జ్ఞాపికలకు గంధోత్సవం

**జమ్మలమడుగు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు పట్టణంలోని జామియా మసీదులో శుక్రవారం సాయంత్రం నమాజు అనంతరం పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి ప్రవక్త దస్తగిరి స్వామి పవిత్ర జ్ఞాపికలకు గంధోత్సవం నిర్వహించారు. మొదటగా పీఠాధిపతి ఇంటిలో స్వామి వారి పవిత్ర గంధానికి పకీర్లు దస్తగిరి స్వామిపై ప్రత్యేకంగా కీర్తనలు ఆలపిస్తూ మేళా నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి పీఠాధిపతి, వారి కుటుంబీకులు జామీయా మసీదు వద్దకు పవిత్ర గ్రంధాన్ని తీసుకొచ్చి మసీదులో దస్తగిరి స్వామి పవిత్ర జ్ఞాపికలకు ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ స్వామి వారి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురువులు అసద్ పాషాఖాద్రి, వారి కుటుంబీకులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ, జౌళీ, చేనేత శాఖలకు మెరుగైన లబ్ధి

**జమ్మలమడుగు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దసరా, దీపావళి పండగల సందర్భంగా జీఎస్టీ-2 పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా దేశంలోని వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమల రంగం, చేనేత శాఖ తదితర వర్గాల వారు వివిధ రకాల వాహనాలు, పనిముట్లు యంత్రాలకు కొనుగోలులో జీఎస్టీ తగ్గింపుతో చాలా వరకు లబ్ధి చేకూరుతుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా 200 ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం సభా భవనం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున, ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, వ్యవసాయ, జౌళి, పాడి పరిశ్రమల శాఖల అధికారులు పాల్గొన్నారు. దీపావళి పండగలకు కానుకగా జీఎస్టీ-2 పథకాన్ని ప్రారంభించి మోదీని అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. రైతులకు ఇన్సూరెన్స్ మరియు ప్రజలకు జీవిత బీమాపై జీఎస్టీ పూర్తిగా తొలగించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జౌలిశాఖ ఏడీ సిద్దేశ్వరరావు, నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీలు అనిత, రామ్మోహన్‌రావు, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, వ్యవసాయ అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, కూటమి నాయకులు బేపారి మహ్మద్ రఫీ, భీమగుండం రాజారెడ్డి, నియోజకవర్గ అధికారులు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఇన్చార్జ్ చమర్తి



**సిద్ధవటం సెప్టెంబర్ 3 ప్రభాతవార్త**
సిద్ధవటం మండలం విజయదశమి పండుగ పురస్కరించుకుని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్రాజు ఆలయాలను సందర్శించారు. సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామపంచాయతీ బంగారు పేట లోని శ్రీ గంగాభవాని అమ్మవారిని ఒంటిమిట్ట అమ్మవారి శాల నందు శ్రీ కన్యకా పరమేశ్వరిని, ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన ఆంజనేయస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు.ఆయనకు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో సిద్ధవటం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి, ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు, ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దు కృష్ణారెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జ్ దారపునేని దశరథ రామానాయుడు లాయర్ ఆదినారాయణ బొబ్బిలి రాయుడు, కరెంట్ రమణ, స్థానిక యువకులు టిడిపి నాయకులు, అభిమానులు భక్తులు పాల్గొన్నారు.

## వసంతోత్సవంతో ముగిసిన దసరా మహోత్సవాలు



**బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 03 ప్రభాతవార్త**
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వసంతోత్సవం తోదసరా మహోత్సవంలో శుక్రవారంతో వైభవంగా ముగిసినట్లు అమ్మవారి శాల అధ్యక్షుడు అయ్యపు వెంకట సురేష్ బాబు తెలిపారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు అశేష జనవాహిని మధ్య మేళ తాళాలతో డ్రప్పు వాయిద్యాలతో శ్రీ వాసవి అమ్మవారు పురవీధుల గుండా ఊరేగింపుగా నరసన్నపల్లెలో ఉండే జమ్మిచెట్టు వెళ్లారు. దసరా ఉత్సవాలలో విశేష పూజలు నిర్వహించి. పూజలు అందుకున్న లడ్డును వేలం పాట నిర్వహించగా 51000 తో అమ్మవారి శాల అధ్యక్షుడు అయ్యపు వెంకట సురేష్ బాబు దంపతులు దక్కించుకున్నారు. వేలంపాటలో ఈ లడ్డు మాకు రావడం ఎన్నో జన్మల పుణ్యఫలం ఆయన అన్నారు. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఊరేగింపు ముందు ఆర్యవైశ్య పెద్దలు పిల్లలు మహిళలు ఆనందంతో వసంతోత్సవం చల్లుకుంటూ జై వాసవి మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. అమ్మవారు ఊరేగింపు లో ఆర్యవైశ్యులు వారి ఇంటి ముందు ఆర్యవైశ్య మహిళలు టెంకాయ కర్పూరం ఇచ్చి మ్రొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అమ్మవారి శాల కార్యదర్శి సుంకు సురేష్ బాబు, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు యాదాల్ల వెంకటసుబ్బయ్య, మహిళ మండలి అధ్యక్షురాలు పబ్బతి లక్ష్మీదేవి మ్యాక సుధాకర్, దుగ్గిశెట్టి గురవయ్య, పబ్బతి ఛాని,తదితరులు ఉన్నారు.

## ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



**చిట్వేలి, అక్టోబర్ 3, ప్రభాతవార్త:**
చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, 11 రోజులపాటు వైభవంగా నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గురువారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు, విజయలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ వాసవి మాత, ప్రత్యేక అలంకారంలో శ్రీ శ్యామలాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కాగా శుక్రవారం ఉదయం ఆర్యవైశ్యులు సమిష్టిగా భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రధాన వీధులలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపును పెద్ద ఎత్తున చేపట్టారు. రంగుల పులుముకుంటూ, వసంతాలు పోసుకుని యువత, పెద్దలు, మహిళలు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ వాసవి మాతకు శయ్యా అలంకారము ఊంజల్ సేవను నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నాను. ఆలయ పెద్దలు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

## దసరాగా ముగింపు వేడుకల్లో ఎంపీ మిథున్ రెడ్డి



కన్యకా పరమేశ్వరి సన్నిధిలో ఎంపీ మిథున్ రెడ్డి

**రాజంపేట,అక్టోబర్3 ప్రభాతవార్త**
రాజంపేటలో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారిని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పి.వి.మిథున్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ మర్యాదలతో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని ఎంపీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్ సనిశెట్టి నవీన్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సత్యం, సెక్రటరీ పి.చంద్ర, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు పలువురు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు మృతి.

**తంబళ్లపల్లె అక్టోబర్ 3. ప్రభాతవార్త :**
మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన టిడిప నాయకుడు ఇర్రి వెంకటరమణప్ప నాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన టిడిపి ఆవిర్భావం నుండి గంగిరెడ్డిపల్లి పంచాయతీలో రెండు మార్లు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా, వి.ఎస్. ఎస్ చైర్మన్గా, ఉప సర్పంచ్ గా క్రియాశీలక నాయకుడిగా పనిచేసి ప్రజాసేవ చేసి గుర్తింపు పొందాడు. ఆయన మృతి పై తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి తీవ్ర సంతాపం తెలిపి టిడిపి ఓ సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు.

## తంబళ్లపల్లె ఎంపీడీవోగా బాపూజీ పట్నాయక్

**తంబళ్లపల్లె అక్టోబర్3. ప్రభాతవార్త :**
ఎంపీడీవో బాపూజీ పట్నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గత మూడు మాసాలుగా మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ థామస్ రాజా ఇన్చార్జి ఎంపిడిఓ గా కొనసాగారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఈ ఓ ఆర్ డి గా పనిచేస్తున్న బాపూజీ పట్నాయక్ పదోన్నతి పై తంబళ్లపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్ రెడ్డి, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘనంగా సన్మానించి స్వాగతించారు.

## వైభవంగా కుంకుమ పూజ



**పెనగలూరు అక్టోబర్ 3 ప్రభాతవార్త**
మండల కేంద్రంలో ఉన్నటువంటి వినాయక నగర్లో విజయదుర్గా దేవి శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరిరోజైన విజయదశమి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని వినాయక నగర్ లో ఏర్పాటుచేసిన విజయ దుర్గాదేవి సన్నిధిలో గురువారం రాత్రి కుంకుమ పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. వినాయక నగర్ విజయ దుర్గా దేవి ఉత్సవాల కమిటీ సభ్యుల ఆహ్వానంతో తలమంచి గిరీష్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ కుటుంబ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ బిఎల్ నరసింహారెడ్డి గ్రామ పెద్దలు టి సుబ్బారెడ్డి గణేష్ రెడ్డి నవీన్ సందీప్ రెడ్డి ఆకుల చిన్న పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విజయదశమి వేడుకలు

### మిన్నంటిన బాణసంచా సంబరాలు

**రాజంపేట,అక్టోబర్3 ప్రభాతవార్త**



రాజంపేటలో విజయదశమి పర్వదినం సందర్భంగా అంగరంగ వైభవంగా సంబరాలు జరిగాయి. స్థానిక అమ్మవారి శాలలో ఏడాదికి ఒకసారి మాత్రమే కనిపించే నిజరూప దర్శనం కన్యకా పరమేశ్వరి మాత ఆవిష్కృతమైంది. తెల్లవారుజామునే వాసవి మాతను చందనంతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి స్నపన తిరుమంజన సేవ, పంచామృతాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనానికి సిద్ధం చేశారు. రాతి విజయదశమి ప్రధాన మెరవణి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. జమ్మి చెట్టు వద్ద వాసవి మాత ఊరేగింపుగా వెళ్లిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొట్టి మెరవనితో స్థానిక పాత బస్టాండుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బాణాసంచా వేడుకలను కేరింతలు కొడుతూ చూసారు. నాగుపాము బుసలు కొట్టే విధంగా, గాలికి చెట్లు ఎలా ఊగుతాయో ఆ విధంగా బాణాసంచా కాల్చారు. అనంతరం శుక్రవారం ఉదయం వసంతం ఘనంగా జరిగింది ఆర్యవైశ్య సోదరులు పెద్ద ఎత్తున వసంతోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే వీరచౌడేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా సాధు కామాక్షమ్మ ఆలయం, మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## వైభవంగా దసరా వేడుకలు

**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :**



నవరాత్రుల సందర్భంగా గురువారం దసరా పండగ పట్టణంలో వైభవంగా జరిగింది. శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో జరిగిన అమ్మవారి పూజలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్య అతిధిగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయకమిటీ చైర్మెన్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు ఒంప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అదే విధంగా చౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ ఛైర్మెన్ పురాణం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైభవంగా పూజలు జరిగాయి. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో దుర్గాదేవికి విశేష పూజలు చేశారు. శ్రీవారినగర్‌లోని బోయకొండ గంగమ్మ, శ్రీ అభయలక్ష్మినరసింహాస్వామి ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌స్వామి ఆధ్వర్యంలనో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మడికయ్యల శివాలయంలో కూడా దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

## మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా కుప్పయ్య యాదవ్

**బద్వేల్ అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



బద్వేలు మార్కెట్ యార్డు డైరెక్టర్ గా పోలుబోయిన కుప్పయ్య యాదవ్ నియమితులైనారు. ఆయన సేవలను గుర్తించి అధికార తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బద్వేలు ప్రాంత తెలుగుదేశం పార్టీ ఇంచార్జి రితేష్ రెడ్డి నామినేటెడ్ పదవిని ఇచ్చి గౌరవించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ గా నియమితులైన పోలుబోయిన కుప్పయ్య యాదవ్ మాట్లాడుతూ నాకు అప్పగించిన పనులను సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీకి విధేయంగా నడుచుకుంటానని చెప్పారు.ఈ పదవి నాకు మరింత బరువు బాధ్యతలను రెట్టింపు చేసిందని చెప్పారు.మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు, రితేష్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కుప్పయ్య యాదవ్ ను మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ గా నియమితులైనందుకు అట్లూరు మండలం ప్రజలు , బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
కడప జిల్లా: బద్వేలు రూరల్, పోరుమామిళ్ల, కొండాపురం, లింగాల, సికెదిన్నె, అట్లూరు
అన్నమయ్య జిల్లా: బి.కొత్తకోట, వీరబల్లి, పిటిఎం, కలకడ, వాయల్పాడు, రైల్వేకోడూరు, పుల్లంపేట, నందలూరు
ఇంటర్వ్యూ తేది : 11.10.2025
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086